ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
శుక్రవారం 5 డిసెంబరు 2025



స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

షాద్‌నగర్‌రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రజల్లో చైతన్యం, భయం పోగొట్టేందుకు గురువారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద, ఎల్లంపల్లి, చౌలపల్లి, కిషన్‌నగర్ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి తారతమ్య భేదాలు లేవన్నారు. పోలింగ్ కేంద్రాలకు నిర్భయంగా వచ్చి ఓటు వేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



కలెక్టరేట్ నుంచి మండలాలకు తరలుతున్న ఎన్నికల సామగ్రి

మండలాలకు ఎన్నికల సామగ్రి

పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని గురువారం కలెక్టరేట్ నుంచి వివిధ మండలాలకు తరలించారు. జిల్లాలో 21 గ్రామీణ మండలాలు ఉండగా, మూడు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకోసం అధికార యంత్రాంగం ముందస్తుగా ఎన్నికల సామగ్రిని ఆయా మండలాలకు తరలిస్తోంది.

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

జంపింగ్ జపాంగ్!

కండువాలు మార్చుతున్న లోకల్ లీడర్లు, కార్యకర్తలు

- ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా పంచాయతీ ఎన్నికలు
- గ్రామాల్లో పరపతి ఉన్న నాయకులకు గాలం
- సర్పంచ్ అభ్యర్థుల ప్రోద్బలం, ప్రలోభాలతోనే మార్పు
- జంప్ జిలానీలతో అయోమయంలో పోటీదారులు



పంచాయతీ ఎన్నికల్లో కప్పదూకుడు రాజకీయం జోరుగా సాగుతోంది. పొద్దునో పార్టీ.. మాపటికో పార్టీ అన్న చందంగా గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల తీరు ఉంటోంది. పోటీలో నిలిచిన అభ్యర్థులు తమ ఓటు బ్యాంకు పెంచుకోవడానికి ఎత్తులేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బలపరుస్తున్న అభ్యర్థులు ఎదుటి పార్టీల కార్యకర్తలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఆయా పార్టీల ఆహ్వానం మేరకు స్థానిక నాయకులు అటు నుంచి ఇటు, ఇటునుంచి అటు దూకడం మొదలు పెట్టారు. ఇందుకు వారికి భారీ ప్రలోభాలతో పాటు వారి వార్డుల్లో పనులు, వ్యక్తిగత పనులు చేసి పెడతామంటూ హామీలిస్తున్నారు. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో.. ఎవరి వెంట తిరుగుతారో తెలియక అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

షాద్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): "కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.. ఓడిపోలేదోయ్" అన్నాడు ఆనాటి దేవదాసు.. కానీ పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలోయ్.. అంటున్నారు నేటి పదవీ దాసులు. గ్రామాల్లో ఎన్నికల బరిలో అభ్యర్థులుగా ఉన్న నాయకులు ఒక పార్టీ నుంచి మద్దతు లేకపోతే మరో పార్టీ వైపు వలసలు పోతుండగా, గ్రామాల్లో ఉనికిని చాటే నాయకులు సైతం ఆయా పార్టీల ఆహ్వానం అందుకుని అటు నుంచి ఇటు, ఇటునుంచి అటు దూకడం మొదలు పెట్టారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఈ జంపు జిలానీల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రస్తుత సర్పంచ్ ఎన్నికల రాజకీయాలను ఒకసారి పరిశీలిస్తే..

గెలుపే టార్గెట్..

ప్రధాన పార్టీలు పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ తమ పార్టీలకు చెందిన అభ్యర్థులను ఎలాగైనా గెలిపించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో పట్టున్న నాయకులపై దృష్టి సారించాయి. ఆయా పార్టీల్లో వారికి ఉన్న గౌరవ మర్యాదలు, పదవులను చూసి తమ పార్టీలోకి ఆహ్వానించేలా వ్యూహ రచనలు చేస్తున్నాయి. తమ పార్టీలో చేరితే మంచి పదవి ఇవ్వడంతో పాటు, వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ టికెట్లు ఇస్తామని

మిగతా 8వ పేజీలో...

రెండో రోజూ అదే జోరు

సజావుగా తుది విడత నామినేషన్లు

174 సర్పంచ్ స్థానాలకు 297.. 1,598 వార్డు స్థానాలకు 1,533 దాఖలు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుది విడత పంచాయతీ ఎన్నికల్లో గురువారం రెండోరోజు ఏడు మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ సాఫీగా కొనసాగింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మాడ్గుల

మిగతా 8వ పేజీలో...



ఉప్పరిగూడలో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి శ్రీవాణి

మూడో విడత నామినేషన్ల వివరాలు..

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
ఇబ్రహీంపట్నం	14	25	144	130
మంచాల	23	25	216	94
యాచారం	24	52	232	230
అబ్దుల్లాపూర్‌మెట్	14	28	134	185
మాడ్గుల	34	60	302	180
కందుకూరు	35	54	312	383
మహేశ్వరం	30	53	258	331
మొత్తం	174	297	1,598	1,533

ఆ రెండు మున్సిపాలిటీలు ఎల్బీనగర్ జోన్‌లోకి..?

ఎమ్మెల్యే మల్‌రెడ్డి వినతితో స్పందించిన ప్రభుత్వం!

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గతంలో జిల్లాలోని తుర్కయంజాల్, ఆదిభట్ల మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ, వీటిని చార్మినార్ జోన్‌లోకి తీసుకున్నారు. వీటిని ఎల్బీనగర్ జోన్ పరిధిలోకి తీసుకోవాలంటూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వానికి రాసిన లేఖ రాశారు. ఈ రెండు మున్సిపాలిటీలకు ఎల్బీనగర్ జోన్ అనుకూలంగా ఉంటుదని, ఈ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావులకు ఆయన లేఖలు రాశారు. దీనిపై అధికార యంత్రాంగం స్పందించింది. ఈ రెండు మున్సిపాలిటీలను ఎల్బీనగర్ జోన్ పరిధిలోకి మార్చనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.



మొదలైన బుజ్జగింపుల పర్వం.. కుల సంఘాల ఓట్లకు గాలం

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థుల ఎత్తుగడలు

69 సర్పంచ్ పదవులకు 444, వార్డులకు 1781 నామినేషన్లు

నాలుగు సర్పంచ్ పదవులు ఏకగ్రీవం .. 14వ తేదీన ఎన్నికలు

ఏకగ్రీవాలకు పెద్దపీట

ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం

ఆమనగల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రెండోవిడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. ఈనెల 14న ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఈ మండలాల్లో పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రామ పెద్దలు, కుల సంఘాల నాయకులతో సమావేశమై ఏకగ్రీవాలు చేసేందుకు కృషి చేస్తున్నారు. పంచాయతీలు ఏకగ్రీవమైతే ఉపయోగాలను బడా లీడర్లు వివరిస్తున్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలో 69 సర్పంచ్ స్థానాలకు 444 నామినేషన్లు, 594 వార్డులకు 1781 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆమనగల్లు మండలంలో 13 సర్పంచ్ స్థానాలకు 86 నామినేషన్లు, 112 వార్డులకు 336, తలకొండపల్లి మండలంలో 32 సర్పంచ్‌లకు 205, 272 వార్డులకు 742, కడ్తాల మండలంలో 24 సర్పంచ్‌లకు 153, 210 వార్డులకు 703 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు మాధురి, శ్రీకాంత్, సుజాత పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం కోనాపూర్, కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండా, రేఖ్య తండా, తలకొండపల్లి మండలం బల్సులపల్లి పంచాయతీ సర్పంచ్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో అవి ఏకగ్రీవమయ్యాయి. ఇది అధికారికంగా

మిగతా 8వ పేజీలో...

ఈగల మందు పిచికారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కందుకూరు డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో పంచాయతీ అధికారులు ఈగల మందు పిచికారీ చేయించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వామ్మో ఈగలు' కథనానికి వారు స్పందించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న కోళ్లఫాం యజమానిపై ఒత్తిడి తీసుకొచ్చి గ్రామంలో ప్రధాన వీధుల్లో ఈగల మందును పిచికారీ చేయించారు. ప్రతీ 20 రోజులకు ఒకసారి గ్రామంలో ఈగల మందును పిచికారి చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీహరిగౌడ్ తెలిపారు. ఇక నుంచి ఈగల బెడద లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఈగల మందును పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

అభివృద్ధి పనుల్లో రాజీ పడొద్దు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఏమాత్రం రాజీపడొద్దని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మున్సిపల్ కమిషనర్ సునీతను ఆదేశించారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ ఆఫీసును ఎమ్మెల్యే తనిఖీ చేశారు. షాద్‌నగర్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి పనులను చేస్తున్నామని గుర్తుచేశారు. ప్రధాన రోడ్లను విస్తరిస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్గనూరి విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, అగ్గనూరి బస్వం, ఇబ్రహీం, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, జమ్రుద్‌ఖాన్, మురళీమోహన్, యాదగిరియాదవ్, నలమోని శ్రీధర్, ముబారక్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

ఆదిభట్లను చార్మినార్ జోన్‌లో కలపొద్దు

అదనపు కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

ఆదిభట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శివారు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కు తీసుకోవాలని, ఆదిభట్ల మున్సిపల్‌ను చార్మినార్ జోన్‌లో కలపొద్దని బీఆర్ఎస్ ఆదిభట్ల నాయకులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మహేందర్ మాట్లాడుతూ 2018 ఏర్పడిన ఆదిభట్ల మున్సిపల్‌ను గ్రేటర్‌లో విలీనం చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఇది సరైన నిర్ణయం కాదన్నారు. మున్సిపల్‌ను జీహెచ్ఎంసీలో కలపడంతో ప్రజలపై పన్నుల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిభట్ల మున్సిపాలిటీగా మారినా పట్టణీకరణంగా ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. జీహెచ్ఎంసీలో కలపడంతో రాజకీయ, నిరుద్యోగంతో పాటు అన్నివిధాలా ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. దాంతో పాటు హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఆదిభట్లను చార్మినార్ జోన్‌లో కలపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం పునరాలోచించి ఆదిభట్లను ఎల్బీనగర్ జోన్‌లో కలపాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో గోదాసు మధుకర్, మహేందర్, రాజ్ కుమార్, సుమన్, సందీప్ కుమార్, సుధాకర్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



ఆక్రమణకు గురైన ఎక్స్ సర్వీస్‌మెన్‌ల భూమి

ప్రభుత్వ భూమిని కాపాడండి

- మహేశ్వరంలో 19 ఎకరాల ల్యాండ్ ఆక్రమణకు తెరలేపిన బీఆర్ఎస్ నాయకులు
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు
- కబ్జాపై విచారణ చేయాలంటూ రెవెన్యూ అధికారులను ఆదేశించిన కేఎల్లార్

మహేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వరం నియోజకవర్గంలో ప్రభుత్వ, భూదాన్, సీలింగ్ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మహేశ్వరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 461లో మొత్తం 128 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో అప్పటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ హయాంలో 19ఎకరాల భూమికి సంబంధించి ఒక ఎక్స్ సర్వీస్ మన్ తోపాటు మహేశ్వరం ఎస్సీలు, కావలోనిబాయి తండాకు చెందిన కొందరు గిరిజనులకు సీలింగ్ పట్టాలు ఇచ్చారు. ఎలాంటి ఎన్వోసీలు లేకుండా కోట్ల రూపాయల విలువ చేసే ఆ భూములను ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అండదండలతో మహేశ్వరం గ్రామానికి చెందిన కె. చంద్రయ్య తోపాటు మరికొందరు బీఆర్ఎస్ నాయకులు విక్రయించాలని చూస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కేఎల్లార్... మహేశ్వరం రెవెన్యూలోని సర్వేనెంబర్ 461లో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములను సర్వేచేసి వివరాలను సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మహేశ్వరంలో ఎకరం భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.4కోట్లు ధర పలుకుతుందని, అలాంటి విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. అవసరమైతే ఆక్రమణలకు గురైన ఎక్స్ సర్వీస్‌మెన్‌ల భూమిలో ఉన్న ప్రహరీని తొలగించాలని రెవెన్యూ అధికారులకు సూచించామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన బీఆర్ఎస్ నాయకులపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని కేఎల్లార్ అన్నారు.

యుద్ధ ప్రాతిపదికన గ్లోబల్ సమ్మిట్ పనులు

- రాత్రి, పగలు శ్రమిస్తున్న కార్మికులు, అధికారులు
- ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంకతో పాటు పలు శాఖల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మీర్ఖాన్‌పేటలోనే బస



మీర్ఖాన్‌పేటలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ పనులు

కందుకూరు డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో డిసెంబర్ 8, 9వ తేదీల్లో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ సమ్మిట్ సమయం దగ్గర పడడంతో అధికారులు ఏర్పాట్లను మరింత ముమ్మరం చేశారు. ఫ్యూచర్‌సిటీ అథార్టీ ఎండీ శశాంకతో పాటు పలు శాఖల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాత్రి, పగలు లేకుండా పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. ఇప్పటి వరకు దేశ, విదేశాల నుంచి వచ్చే పెట్టుబడుదారులు, పారిశ్రామికవేత్తలు మీర్ఖాన్‌పేటలోని 120 సర్వే నంబర్‌లో సుమారు వంద ఎకరాలలో రెండు రోజుల పాటు ఇక్కడే బస చేయడానికి ఏర్పాట్లు చేశారు. గురువారం గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో బీటీ రోడ్లు, భూగర్భం ద్వారా విద్యుత్ సరఫరా, మొక్కలు నాటడం, అలాగే వెలుపలి భాగంలో ఎల్ఈడీలను ఏర్పాట్లను మరింత ముమ్మరం చేశారు. గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయడానికి 30 శాఖల అధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమైయ్యారు.

మూడు హెలీప్యాడ్‌ల ఏర్పాటు

ఈ సదస్సుకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రముఖులు హాజరుకానున్నందున వీరి కోసం, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని ప్రముఖ హోటళ్లలో బస చేసిన అనంతరం ఇక్కడికి రావడానికి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి కిలోమీటర్ దూరంలో మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు. గ్లోబల్ సమ్మిట్ వచ్చే ప్రతినిధులను పక్కనే ఉన్న అమెజాన్ డాటా కేంద్రం, ఫ్యూచర్‌సిటీ కమిషనర్, స్కిల్ యునివర్సిటీ భవనాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో చేయించడానికి ప్రత్యేకంగా రోడ్ల పనులను చకచకగా కొనసాగిస్తున్నారు. గురువారం ఫ్యూచర్‌సిటీ అథార్టీ ఎండి శశాంక, జిల్లా డిప్యూటీ కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌లతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పనులను పరిశీలించారు.

పారిశ్రామికవాడల స్థలాలు అమ్ముకునే కుట్ర

మేడ్చల్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ జోన్‌ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ చట్టం పేరుతో అమ్ముకునే కుట్ర చేస్తోందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. హిల్ట్ బిల్లును నిరసిస్తూ గురువారం మేడ్చల్ పారిశ్రామిక వాడ వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి హైదరాబాద్ చుట్టూ గత ప్రభుత్వాలు వేలాది ఎకరాల్లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలకు సంబంధించిన భూములను అమ్ముకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నడం దురదృష్టకరమన్నారు. పారిశ్రామిక వాడలున్న స్థలాలు చాలా వరకు ప్రభుత్వ స్థలాలని, వాటిని పరిశ్రమల పేరిట తక్కువ ధరకట్టి పారిశ్రామిక వేత్తలకు కేటాయించిందన్నారు. ఈ స్థలాలకు ప్రస్తుతం భారీ ధర పలుకుతుండడంతో కుట్ర పూరితంగా అమ్ముకునేలా హిల్ట్ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ స్థలాల్లో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ భూములను అమ్ముకునే వీలు కల్పిస్తూ తెచ్చిన కొత్త చట్టాన్ని ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలని, ప్రజల ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క పౌరుడిపై ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వీధిన పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. శంభీపూర్ రాజు మాట్లాడుతూ... కుట్ర పూరితంగా ఇండస్ట్రియల్ జోన్ స్థలాలను విక్రయించేందుకు హిల్ట్‌ను అమలు పరుస్తున్నారన్నారు. పరిశ్రమల స్థలాలను విక్రయించి డబ్బులు ఆర్జించే కుట్రకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, భాస్కర్ యాదవ్, దయానంద్, రాజ మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌గౌడ్, నడికొప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఫ్యూచర్ సిటీతో 'రియల్' మోసం

- హిల్ట్ పాలసీ రద్దు చేసే వరకూ పోరాటం
- దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణం
- ఎమ్మెల్యే పి.సబితారెడ్డి

రాజేంద్రనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ పేరుతో రూ.5లక్షల కోట్ల భారీ కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. హిల్ట్ పాలసీ కుట్రను ఎండగట్టేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ పారిశ్రామికవాడలో శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, గంథ్రాలయ సంస్థల మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్‌తో కలిసి పర్యటించారు. కాటేదాన్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇండస్ట్రియల్ ల్యాండ్స్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని సబితారెడ్డి ఆరోపించారు. రిజిస్ట్రేషన్ ఫీజును 30శాతం చెల్లిస్తే పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గం అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న 22 పారిశ్రామిక వాడల్లో సుమారు 9వేల ఎకరాల భూముల యాజమాన్య మార్పునకు తెచ్చిన జీవో నంబరు 27ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హిల్ట్ చట్టంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కాటేదాన్ ఫ్యాక్టరీల్లోని కార్మికులు తమ సమస్యలను సబితకు చెప్పుకున్నారు. పరిశ్రమలను తరలిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడతాయని అనుకున్నామని, జీవో 27తో బతుకులు రోడ్డున పడే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుభాష్ రెడ్డి, పి.ధర్మారెడ్డి, పి.జీవన్‌దాస్, ముక్రమ్‌ఖాన్, జియావుద్దీన్, డి.రమేష్, లక్ష్మీరాజ్ పాల్గొన్నారు.


కాటేదాన్ పారిశ్రామికవాడలో కార్మికులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

తాండూరులో ఘనంగా అయ్యప్ప పడి పూజ


పడి పూజ నిర్వహిస్తున్న మహేందర్‌రెడ్డి-సునీతారెడ్డి దంపతులు

తాండూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాండూరులోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి-సునీతారెడ్డిల కుమారుడు పట్నం రినిష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మహేందర్‌రెడ్డి దంపతులు పడిలో పాల్గొని పూజలు నిర్వహించారు. తాండూరు పట్టణం, సమీప ప్రాంతాల భక్తులు తరలివచ్చి పూడిలో పాల్గొన్నారు. అన్నదాత రినిష్‌రెడ్డి అభిషేకాలు, చివర పల్లకి సేవ నిర్వహించారు. మహేందర్‌రెడ్డి సునీత దంపతులు, వారి కుమారుడు రినిష్‌రెడ్డి భక్తులకు బిక్షను వడ్డించారు. కార్యక్రమంలో పీసీసీ నాయకుడు కె.పురుషోత్తంరావు, జిల్లా డీసీసీ చీఫ్ ధారాసింగ్, వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, మల్కోడ్ రాకేష్, వడ్డె శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, విశ్వనాథ్‌గౌడ్, స్వప్నపరిమళ, శోభారాణి, పరిమళ, అనురాధ, సంపత్‌కుమార్, శ్రీనివాస్‌చారి, నవాంద్గి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంతో విశ్వశాంతి సాకారం


మహా సభలో మాట్లాడుతున్న శివానంద స్వామి

ఆమనగల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికమార్గం విశ్వశాంతికి దోహదం చేస్తుందని సద్గురు నిత్యాశుద్ధానంద స్వామి కేంద్రం, శ్రీ రామదాత ఆశ్రమ సంస్థాపకులు శివానందస్వామి అన్నారు. ఆధ్యాత్మిక చింతన లేని మనిషికి వినయశీలత ఉండదని పేర్కొన్నారు. ఆమనగల్లులోని వాసవి కల్యాణ మండపంలో గురువారం తృతీయ ఆర్ష వేదాంత విజ్ఞాన మహాసభలు నిర్వహించారు. సభలకు శివానంద స్వామి హాజరయ్యారు. రామదూత ఆశ్రమం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాలను నిర్వహించారు. శివానందస్వామి మాట్లాడుతూ.. మనిషి భావాలు ఉన్నతంగా ఉంటేనే జీవితంలో ఉన్నతుడవుతాడన్నారు. సమాజంలో అనేక అనర్థాలకు కోరికలు, మనస్సు చంచలత్వమే కారణమన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు యాదయ్య, రామ్మోహన్, శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించండి

వికారాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల విధుల నుంచి గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులకు, నిరక్షరాస్య అటెండర్లకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రాములు జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పీవోలుగా, సీనియర్ ఉపాధ్యాయులకు ఓపీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారని, ఈ అంశాన్ని పునః పరిశీలించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి 40శాతం నిధులు విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారని సందర్భంగా వారు తెలిపారు. ఇదిలా ఉంటే పరిగి మండలంలో ఐదేళ్ల కింద చనిపోయిన అంగన్‌వాడీ టీచర్‌కు పెద్దేముల్ మండలంలో శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలంటూ సమాచారమివ్వడం చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ టీచర్లు కనకాచారి, పాండురంగయ్య, రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయిన ఉద్యోగికి ఎన్నికల విధులు కేటాయించారని ఫెడరేషన్ నాయకులన్నారు.

'సర్పంచ్‌గా గెలిపిస్తే ఆడపిల్ల పెళ్లికి రూ.10వేలు'

పెద్దేముల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తనను సర్పంచ్‌గా గెలిపిస్తే తండాలో ఆడపిల్ల పెళ్లికి రూ.10వేల సాయం చేస్తానని మండలంలోని కందనెల్లి తండా సర్పంచ్ మహిళా అభ్యర్థి ప్రకటించారు. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే పెళ్లికి ఆర్థిక సాయంతో పాటు తండాలో ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలకు రూ.5వేల చొప్పున ఇస్తామని తెలిపారు. అనారోగ్యానికి గురైన వారికి ఆర్థికసాయం చేస్తానని, ఎల్లవేళలా అందుబాటులో తండావాసులకు సేవచేస్తానని ఆమె పేర్కొన్నారు.

వేంకటేశ్వరాలయంలో కృతిక దీపోత్సవం


దీపాలను వెలిగిస్తున్న మహిళలు, భక్తులు

కొడంగల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కృతిక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వార్లు, శ్రీ వైఖానసస్వామి, అన్నపూర్ణదేవి, గరుడ్మంతుడు, అంజనేయస్వామి, యాగశాల, నవగ్రహాలు, వరహస్వామి, ఆలయ గోపురాలకు, ధ్వజస్తంభానికి ఆలయంలో పూజలు చేసిన దీపాలను ఉంచారు.

సాకేత్ ప్రణామాన్ని పరిశీలించిన హైడ్రా


నిరసన తెలుపుతున్న సాకేత్ ప్రణామం హౌజింగ్ సొసైటీ సభ్యులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సొసైటీకి ఈస్ట్ ఫేజ్‌లో ఉన్న గేటును బిల్డర్ మూసే ప్రయత్నం చేస్తున్నాడని గుండ్లపోచంపల్లి సాకేత్ ప్రణామం హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై హైడ్రా స్పందించింది. గురువారం హైడ్రా అధికారులు సాకేత్ ప్రణామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సొసైటీ వారు చేస్తున్న ఆరోపణలపై కమ్యూనికిటీ ఈస్ట్ ఫేస్ గేట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని హైడ్రా అధికారులతో సొసైటీ సభ్యులు మొరపెట్టుకుని నిరసన చేపట్టారు. ఈస్ట్ ఫేజ్ రోడ్డును చూపించి కాలనీ ప్లాట్లను విక్రయించారని బిల్డర్‌పై ఆరోపించారు. ప్లాట్ల విక్రయాలు పూర్తికాగానే రోడ్డును మూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శేఖర్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి


డీసీపీ రాజేష్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్ రూరల్/షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫరూక్‌నగర్ మండలం కంసాన్‌పల్లికి చెందిన శేఖర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అధ్వర్యంలో నాయకులు గురువారం డీసీపీ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. కంసాన్‌పల్లి పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో వార్డు సభ్యుడిగా నామినేషన్ వేసిన శేఖర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి చేశారని, ఒత్తిడిని భరించలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. శేఖర్‌ను ఆత్మహత్యకు పురికొల్పిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. అలాగే పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార కాంగ్రెస్ పార్టీకి పోలీసులు సపోర్టు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని డీసీపీ దృష్టికి తెచ్చారు. ఎన్నికలు ముగియగానే ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, అందె బాబయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్‌తో రఘువీరారెడ్డి భేటీ



ధారూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మీనాక్షి నటరాజన్ ఆహ్వానం మేరకు ఆయన హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆమెను కలిశారు. వికారాబాద్ జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాల గురించి ఆమె తనతో చర్చించారని రఘువీరారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మారెడ్డి

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ఈ నెల 17న జరుగనున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. గురువారం మీర్కాన్‌పేట, బాచుపల్లి, నేదునూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామస్తులు కలిసికట్టుగా ఓట్లు వేసేలా పార్టీ శ్రేణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక నాయకులు చర్చించి పార్టీ నుంచి పోటీలో ఒక్కరే ఉండేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి


రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని పురస్కరించుకొని షాద్‌నగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటి అద్దె భత్యం పెంచాలి : ఉద్యోగుల ఐకాస

హైదరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, కొంగరకలాన్, ఆదిభట్ల మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేసినందున ఆ ప్రాంతాల ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి అద్దె భత్యం 24శాతానికి పెంచాలని ఉద్యోగ ఐకాస డిమాండ్ చేసింది. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనంపై చైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలన్నారు.

దోమలో ఆసక్తికర పరిణామం

- కాంగ్రెస్ పార్టీ వారే ఇద్దరు నామినేషన్
- ఒకరికి మద్దతుగా నామినేషన్ కేంద్రానికొచ్చిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి





దోమ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దోమ సర్పంచ్ పదవి జనరల్ కావడంతో అధికార పార్టీ నుంచి సర్పంచ్ అభ్యర్థి ఒక్కరే ఉండాలని పార్టీ నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. మొత్తానికి పార్టీ అనుకూలురు ఇద్దరు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్ మద్దతుతో బుధవారం నామినేషన్ వేశారు. అంతలోనే మాలి శివకుమార్‌రెడ్డికి మద్దతుగా గురువారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నామినేషన్ కేంద్రానికొచ్చి నామినేషన్ వేయించారు. దీంతో ఇప్పటికే పార్టీ నుంచి ఇద్దరు నామినేషన్ వేసినట్టయింది. విత్‌డ్రా తర్వాతే బరిలో ఎందరుంటారో తేలనుంది. స్వయంగా ఎమ్మెల్యేనే వచ్చి మరో వ్యక్తికి మద్దతివ్వడంతో మండల కేంద్రంలో పంచాయతీ రాజకీయం రంజుగా సాగనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఖాతాల కోసం బ్యాంకులకు పరుగులు

- పాత ఖాతాలతో సరిపెట్టుకుంటే బాగుండేదని అభ్యర్థుల అభిప్రాయం

కులకచర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డులకు పోటీ చేసే అభ్యర్థులు ఖాతాల కోసం బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. నామినేషన్లకు ఒక్క రోజే గడువుండటంతో అభ్యర్థులతో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో బ్యాంకు కొత్త పొదుపు ఖాతా పాస్‌బుక్‌ను సమర్పించాలని ఎన్నికల సంఘం నిబంధన విధించింది. కులకచర్ల మండలంలో 33 పంచాయతీల సర్పంచ్‌లకు, 280 వార్డులకు పోటీచేసే అభ్యర్థులు ఖాతాల కోసం ఎస్బీఐ, టీజీబీ, హెచ్‌డీఎఫ్‌సీ, ప్రైవేట్ బ్యాంకులకు తరలొస్తున్నారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాలున్నా కొత్తవే కావాలనే నిబంధన విధించడంతో జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఖాతాలున్న వారు ఇప్పుడు కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో ఖాతాలు తెరుస్తున్నారు. రిజర్వుడు స్థానాల్లో కుల ధ్రువీకరణ, పంచాయతీ నుంచి నోడ్యూ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉండటంతో వీటికే సమయం వృథా అవుతుందని పోటీచేయాలనుకుంటున్న వారు వాపోతున్నారు. కొత్త సేవింగ్ బ్యాంక్ ఖాతా తెరవాలని అధికారులు సూచిస్తుండటంతో ఇప్పటికే బ్యాంకు ఖాతా ఉన్నచోట కాకుండా వేరే బ్యాంకులో ఖాతా తెరవాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం కాకుండా పాత అకౌంట్లతోనే ఎన్నికల ప్రక్రియ వరకు వాడేలా చూడాలని కొందరు అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. నామినేషన్ నాటి నుంచి పోలింగ్ వరకు ట్రాన్సాక్షన్లను పాత అకౌంట్ల నుంచి జరిగేలా చూసినా పారదర్శకతకు భంగం వాటిల్లదని అంటున్నారు.





తిరుమలాపూర్‌లో సర్పంచ్ బరిలో నిలిచిన అత్తా కోడలు కుంద్రు చంద్రమ్మ, కుంద్రు సరిత

పంచాయతీ పోరులో అత్తాకోడలు

దౌల్తాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పోరులో అత్తాకోడలి పోటీ రసవత్తరంగా మారింది. మండలంలోని తిరుమలాపూర్ పంచాయతీలో 429ఓట్లు ఉండగా సర్పంచ్ పదవికి ఐదుగురు పోటీ పడుతున్నారు. వారిలో ఒకే కుటుంబానికి చెందిన అత్తాకోడలు కుంద్రు చంద్రమ్మ, కుంద్రు సరిత బరిలో నిలిచారు. గ్రామంలో 8 వార్డులు ఉన్నాయి. వాటిలో నాలుగు ఏకగ్రీవం 4 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. చిన్న పంచాయతీ తిరుమలాపూర్‌లో సర్పంచ్ పదవి ఐదుగురు పోటీలో నిలవడం.. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు పోటీ చేస్తుడడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

నామినేషన్ ప్రక్రియలో ఇబ్బందులు రావొద్దు



కామునిపల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

కులకచర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం మండలంలోని కులకచర్ల, కామునిపల్లిల్లో నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్ ఎన్నిక కోసం జారీచేసిన నోటిఫికేషన్ వివరాలను పరిశీలించారు. అధికారులు పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. గడువులోపు నామినేషన్లు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ ఉన్నారు.

వార్డు సభ్యుడి నుంచి ... ఎమ్మెల్యే వరకు

దివంగత మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి రాజకీయ ప్రస్థానం

- కల్వకుర్తి వార్డు మెంబర్, సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం
- ప్రజాప్రతినిధిగా పంచాయతీ నుంచే ఆరంభం
- ఎమ్మెల్యేగా రెండు సార్లు విజయం



ఎడ్మ కిష్టారెడ్డి(ఫైల్)

ఆమనగల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో జన్మించి పదవులున్నా, లేకున్నా ప్రజా సమస్యలపై కదం తొక్కిన పోరాట యోధుడిగా ఉమ్మడి రాష్ట్రంలో ఖ్యాతి గడించారు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి. ఆయన రాజకీయ ప్రస్తానం పంచాయతీ వార్డు సభ్యుడిగానే మొదలైంది. సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షుడిగా పాలనానుభవం గడించి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ప్రజలను అన్నా, తమ్మీ అని పలకరించే కిష్టారెడ్డి ప్రజాఉద్యమాలతో పోరాటాల కిష్టారెడ్డిగా పేర్గాంచారు. కల్వకుర్తికి చెందిన ఎడ్మ రాంచంద్రారెడ్డి, రాధమ్మ దంపతులకు రెండో కుమారుడిగా 1947లో ఎడ్మ కిష్టారెడ్డి జన్మించారు. పీఎస్సీ వరకు చదవారు. వ్యవసాయం, క్రీడలపై మక్కువ. 20ఏళ్ల వయసులోనే సోషలిస్టు పార్టీ బపర్చిన అభ్యర్థిగా 1970లో కల్వకుర్తి పంచాయతీ వార్డు మెంబర్‌గా పోటీచేసి గెల్చారు. 1973లో జరిగిన ఉపఎన్నికలో కల్వకుర్తి మేజర్ పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఎమర్జెన్సీ సందర్భంగా 1975 డిసెంబరు 31న కల్వకుర్తి గ్రామ సభలో అరెస్టయిన కిష్టారెడ్డి 14నెలలు చెంచల్‌గూడ జైల్లో ఉన్నారు. 1981లో పంచాయతీ ఎన్నికల్లో రెండోసారి మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాసుపై పోటీచేసి ఘన విజయం సాధించారు. 14 వార్డులకు 10 వార్డుల్లో తన ప్యానెల్‌ను గెలిపించుకున్నారు.

సర్పంచ్ పదవే పునాదిగా ఉన్నత పదవులు

కల్వకుర్తి సర్పంచ్‌గా కిష్టారెడ్డి అందించిన సేవలతో ప్రజల్లో గుర్తింపు పొందారు. పంచాయతీలో పారిశుధ్య, తాగునీటి వ్యవస్థకు ప్రాధాన్యం ఇచ్చారు. సోషలిస్టు భావాలు కలిగిన కిష్టారెడ్డి గాంధీజీని ఆదర్శంగా తీసుకొని శ్రమదాన కార్యక్రమాలు చేపట్టారు. రేకుల షెడ్డులో కొనసాగిన పంచాయతీ భవనానికి సొంత భవనాన్ని నిర్మింపజేశారు. వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాల భవనాలతో పాటు 250 మంది పేదలకు ఇళ్లు నిర్మింపజేదీరు. భగత్‌సింగ్‌తండా, జయప్రకాశ్‌తండా, రాంనగర్ తండాల్లో వందలాది మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించడంలో భూమిక పోషించారు.

ఎంపీపీగా గెలిచి అసెంబ్లీలోకి ప్రవేశం

సర్పంచ్‌గా ఉండగానే 1985లో అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడారు. అదే సంవత్సరంలో అప్పటి దివంగత మాజీ గవర్నర్ బీసత్యనారాయణరెడ్డి, మాజీ మంత్రి మహేంద్రనాథ్, ఎల్లారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో 1986లో కిష్టారెడ్డి మండల పరిషత్ ప్రత్యక్ష ఎన్నికల్లో కల్వకుర్తి ఎంపీపీగా అప్పటి పాలమూరు జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెల్చారు. కిష్టారెడ్డి 1994లో అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా టీడీపీని వీడి అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. 1999 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి అసెంబ్లీకి పోటీ చేసి ఓడారు. అయినా ప్రజాసమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు, నిరాహారదీక్షలు చేపట్టి ప్రజాభిమానాన్ని పొందారు. కిష్టారెడ్డి 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండో సారి ఎమ్మెల్యేగా గెల్చారు.

బల నిరూపణ పర్వం

- భారీగా జన సమీకరణలు
- ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో అభ్యర్థులు



బొంరాస్‌పేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రచారానికి తెర లేసింది. తమ బలాన్ని నిరూపించుకునే పనిలో అభ్యర్థులున్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని 35 పంచాయతీలకు ఏడు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 28 పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీ బలనిరూపణలకు సిద్ధమయ్యారు. ఓటర్లకు తాయిలాలు ప్రకటిస్తూ మందు, విందు, వినోదాలతో పాటు రోజువారీ కూలి డబ్బులు ఇస్తూ గ్రామంలో ఓట్లను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. డప్పులతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బొంరాస్‌పేట్‌లో ఓ పార్టీ అనుకూల అభ్యర్థి నామినేషన్ రోజు ర్యాలీగా రాగా ధీటుగా మరో పార్టీ బలపర్చిన అభ్యర్థి అంతకు రెట్టింపు మందితో ర్యాలీ నిర్వహించారు.



బొంరాస్‌పేట్‌లో సర్పంచ్ అభ్యర్థుల ర్యాలీ

ఏకగ్రీవ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక



వీరారెడ్డిపల్లిలో ఉప సర్పంచ్‌ని ఎన్నుకుంటున్న వార్డు సభ్యులు

తాండూరు రూరల్/బషీరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్వార్, రాంపూర్ మీదితండా, వీరారెడ్డిపల్లి ఏకగ్రీవ పంచాయతీల్లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డు సభ్యులు ఉప సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీచేసి వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి సమక్షంలో బిజ్వార్ ఉపసర్పంచ్‌గా కుర్వ సత్యనారాయణ, రాంపూర్ మీది తండా ఉపసర్పంచ్‌గా విజయబాయి, వీరారెడ్డిపల్లి ఉపసర్పంచ్‌గా యెన్నం కవితలను ఎన్నుకున్నారు. సర్పంచ్ అభ్యర్థుల సమక్షంలోనే ఎన్నుకున్నారని ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏకగ్రీంవ సర్పంచ్‌లు పిట్ల అనుసూజ, వెంకట్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉప సర్పంచ్‌తో సర్పంచ్ సుమ్మీబాయి, వార్డు సభ్యులు



బిజ్వార్ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన కుర్వ సత్యనారాయణ

బషీరాబాద్ మండలంలో నాలుగు చోట్ల...


బషీరాబాద్ మండలం నంద్యానాయక్‌తండా ఉప సర్పంచ్‌గా రాథోడ్ గోపిసింగ్, బద్లాపూర్ ఉపసర్పంచ్‌గా మంజూల, బాబునాయక్ తండా ఉప సర్పంచ్‌గా సీతారా, హంక్యానాయక్‌తండా ఉపసర్పంచ్‌గా టోప్యానాయ్ ఎన్నికయ్యారు. గురువారం పంచాయతీ కార్యాలయాల్లో ఏకగ్రీవ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో వార్డు సభ్యులు వారిని ఉపసర్పంచ్‌లను ఎన్నుకున్నారు.

'సర్పంచ్' బరిలో సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు

యాచారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇదివరకు ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవలందించిన వారు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా బరిలో నిలిచారు. గ్రామస్థాయి పదవికి వారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. యాచారం ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా కొప్పు సుకన్య ఐదేళ్లు సేవలందించారు. ఇప్పుడు యాచారం సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దిగి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని గున్‌గల్ సొసైటీ డైరెక్టర్‌గా గెలిచిన టి.రాజేందర్‌రెడ్డి చైర్మన్‌గా ఐదున్నరేళ్లుగా రైతులకు సేవలందిస్తున్నారు. నేడు గున్‌గల్ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. మంతన్‌గౌరెల్లిలో సొసైటీ డైరెక్టర్ కె.యాదయ్య వైస్‌చైర్మన్‌గా ఉన్నారు. నేడు ఆయన మంతన్‌గౌరెల్లి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. వీరిలో జనం ఎవరిని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

సొంత పార్టీ నుంచి ఒక్కరే ఉండేలా...

- సర్పంచ్ బరిలో ఊరికొక్కరే ఉండాలని నాయకుల మంతనాలు
- పార్టీ నుంచి ఓట్లు చీలకుండా యత్నాలు
- గ్రామ నాయకులతో విస్తృత చర్చలు
- అధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు



కులకచర్ల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సొంత పార్టీకి చెందిన వారిలో పోటీ లేకుండా గ్రామ, మండల నాయకులు అభ్యర్థుల మధ్య రాజీ కుదుర్చుతున్నారు. బుధవారం నుంచి మూడో విడత పంచాయతీ సర్పంచ్, వార్డు ఎన్నికల నామినేషన్లు స్వీకరిస్తున్నారు. గ్రామాల్లో పార్టీకి చెందిన వారిలో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఇప్పటికే నాయకుల వద్ద ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి సర్పంచ్ పదవులకు ఒక్కో గ్రామంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున పోటీపడుతున్నారు. అలాంటి ఆశావహులతో జిల్లా, మండల స్థాయి నాయకులు చర్చలు జరుపుతున్నారు. ఒకే పార్టీకి చెందిన వారిలో ఒకరి కంటే ఎక్కువ మంది పోటీచేస్తే ఓట్లు చీలి సర్పంచ్ స్థానాన్ని కోల్పోయే ఆస్కారం ఉంటుందని తెలియజెబుతున్నారు. ప్రజల్లో బలం ఉన్న వారినే ఎన్నికల బరిలో నిలపాలని పావులు కదుపుతున్నారు. నొప్పించక.. తానొవ్వక అనే విధానంలో చర్చిస్తూ ఈ ఎన్నికల వరకూ అంతా ఏకతాటిపై నడవాలని, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అనుకూల అభ్యర్థులను గెలిపించుకుంటే వచ్చే పరిషత్ ఎన్నికల్లో ఏదో విధంగా అవకాశం కల్పిస్తామని నచ్చచెబుతున్నారు. మొత్తానికి పార్టీ అనుకూల అభ్యర్థి ఒక్కరే పోటీలో నిలిచేలా నాయకులు ఇప్పటి నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నామినేషన్లు కూడా ఒక్కరే వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా పరిగి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ కులకచర్ల మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్‌లు తమ పరిధి గ్రామంల్లో కాంగ్రెస్ బలపర్చే అభ్యర్థులను ప్రతీ సర్పంచ్ పదవికి ఒక్కరే ఉండేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి సైతం నియోజకవర్గ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తమ పార్టీకి చెందిన వారిలో సర్పంచ్ పదవులకు ఒక్కరే పోటీ చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రజా సేవలో కుటుంబీకులు

- మాజీ సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా సేవలందించిన ఎమ్మెల్యే ఫ్యామిలీ
- ఇప్పుడు సర్పంచ్ బరిలో ఎమ్మె సత్యనారాయణ తల్లి



ఎమ్మె సత్యనారాయణ, మాజీ సర్పంచ్, ఎస్బీ పల్లి



ఎమ్మె శ్రీలత మాజీ జెడ్పీటీసీ



ఎమ్మె యాదమ్మ, ఎస్బీపల్లి సర్పంచ్ అభ్యర్థిని

కొత్తూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవే మా అభిమతం అంటూ ముందుకు సాగుతోంది శేరిగూడభద్రాయపల్లికి చెందిన ఓ రాజకీయ కుటుంబం. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ 2013లో శేరిగూడ భద్రాయపల్లి సర్పంచ్‌గా గెల్చి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. 2018లో జెడ్పీటీసీ ఎన్నికల్లో కొత్తూర్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కాగా ఎమ్మె సత్యనారాయణ సతీమణి శ్రీలత బీఆర్ఎస్ తరఫున పోటీ గెల్చారు. ఆమె అప్పటి జెడ్పీ పాలకవర్గంలో విద్య, వైద్యం స్టాడింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేశారు. స్వగ్రామం పాటు కొత్తూర్ మండల అభివృద్ధికి మాజీ జెడ్పీటీసీ శ్రీలత పాటుపడ్డారు. ప్రస్తుతం శేరిగూడభద్రాయపల్లి సర్పంచ్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. దీంతో సత్యనారాయణ తల్లి ఎమ్మె యాదమ్మ బరిలో నిలిచారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన తల్లిని సర్పంచ్‌గా గెలిపించుకుంటానని సత్యనారాయణ చెబుతున్నారు.

బిల్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



బిల్ కలెక్టర్‌పై ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తొండుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాల అక్రమాలపై బిల్ కలెక్టర్ రాజశేఖర్‌పై స్థానికులు గురువారం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు ఫిర్యాదు చేశారు. తొండుపల్లి పదో వార్డు బిల్ కలెక్టర్ రాజశేఖర్ కొందరు నాయకులతో కలిసి ఇందిరమ్మ కాలనీలో ఖాళీ స్థలాల్లో ఇందిరమ్మ పట్టాలిప్పిస్తామని పేదల వద్ద రూ.లక్షలు వసూలు చేస్తున్నాడని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 15 సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్న రాజశేఖర్ అవినీతికి అడ్డుకట్ట వేయాలని కమిషనర్‌ను కోరారు. నకిలీ పట్టాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజురులో బిల్ కలెక్టర్ అధికారులను తప్పుదోవ పట్టించాడని, దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్లాట్లు కబ్జా చేసిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. స్పందించిన కమిషనర్ సుమన్‌రావు విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్యగౌడ్, జయసింహ, శ్రీనివాస్‌యాదవ్, సుధాకర్, నర్సింహ, రాజు, అశోక్ పాల్గొన్నారు.

మనీలా... నన్ను క్షమించు

- నేను చచ్చిపోతున్నా.. పాప జాగ్రత్త
- అప్పులోళ్లూ.. నా భార్యాబిడ్డను ఇబ్బంది పెట్టొద్దు
- భార్యకు సెల్ఫీ వీడియో పంపి భర్త అదృశ్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య



మనీల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు



చెరువు గట్టు వద్ద సుందరచారి సెల్ఫీ

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): 'మనీలా నన్ను క్షమించు.. నేను చెరువులో దూకి చచ్చిపోతున్నా... పాప జాగ్రత్త.. నా చావుకు ఎవరూ బాధ్యులు కారు. అప్పులోళ్లూ.. నా భార్య బిడ్డను ఇబ్బంది పెట్టొద్దు.' అంటూ సెల్ఫీ వీడియో భార్యకు వాట్సాప్ చేసి అదృశ్యమైన భర్త ఉదంతమిది. రాయలసీమలోని కదిరికి చెందిన బోనాలా సుందరచారి(40), కొత్తూర్‌కు చెందిన మనీల అలియాస్ కస్తూరి(36)ని పెళ్లి చేసుకొని పరిశ్రమల్లో పనిచేస్తూ షాద్‌నగర్‌లోని రాఘవేంద్ర కాలనీలో ఉంటున్నారు. వీరికి వైష్ణవి అనే ఇంటర్ చదివే కుమార్తె ఉంది. మనీల ఓ మెట్రో హోల్‌సేల్ షాపులో పనిచేస్తుండగా, సుందరచారి ఎలికట్టలోని గ్రానైట్ కంపెనీలో పనిచేసేవాడు. దుబాయ్ వెళ్లి డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో కదిరి ప్రాంతానికి చెందిన మధ్యవర్తులకు డబ్బు ఇచ్చి మోసపోయాడు. దుబాయ్ వెళ్లడానికి పాస్‌పోర్టు వచ్చిన తరువాత మధ్యవర్తులు మోసం చేశారని తెలుసుకున్న సుందరచారి షాద్‌నగర్‌లో అడ్డాకూలీగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే పనికివెళ్తున్నానని బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన అతడు మధ్యాహ్నం 'నేను చచ్చిపోతున్నా.' అని సెల్ఫీ వీడియోను భార్యకు పంపి మొబైల్ స్విచాఫ్ చేశాడు. దీంతో అతడి భార్య కస్తూరి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంట్లో గొడవలు లేవని, పని దొరకడం లేదన్న ఆవేదనతోనే తన భర్త ఇంటి నుంచి వెళ్లాడని మనీల తెలిపింది. ఇంటి నుంచి రెండు జతల డ్రెస్సులు, సెల్‌ఫోన్ చార్జర్ తీసుకొని వెళ్లినట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. మరి సుందరచారి ఎక్కడున్నాడు? ఏమయ్యాడో అన్న ఆందోళనలో ఉన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏకగ్రీవాలకు పెద్దపీట

(ఐదో పేజీ తరువాయి)

ప్రకటించాల్సి ఉంది. కాగా, ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాన రాజకీయ పార్టీల నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. గ్రామ స్థాయిలో జరిగే పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఓటర్ల ప్రసన్నం చేసుకునేందుకు అప్పుడే ఎత్తుగడలు మొదలు పెట్టారు. కుల సంఘాల మద్దతు కూడగట్టుకునేందుకు పెద్దలతో అభ్యర్థులు, ప్రధాన పార్టీలు సంప్రదింపులు జరుపుతున్నాయి. కొన్ని గ్రామాలలో ఒకే పార్టీ నుంచి ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు ఇచ్చి గెలుపునకు కృషి చేయాలని రెబల్‌గా బరిలోకి దిగిన అభ్యర్థులకు నచ్చచెబుతున్నారు. భవిష్యత్‌లో పార్టీ నుంచి అవకాశాలు కల్పిస్తామని ముఖ్య నేతలు హామీ ఇచ్చి బుజ్జగించి బరి నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. రిజర్వేషన్ల కారణంగా సర్పంచ్‌గా అవకాశం రాని ఆశావహులు ఉప సర్పంచ్ పదవిపై ఆశలు పెంచుకొని వార్డు మెంబర్ పదవికి పోటీలో నిలుస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉండి రాజకీయంగా చైతన్యం కలిగిన ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల్, తలకొండపల్లి మండలాల్లో పంచాయతీ ఎన్నికల్లో డబ్బు ప్రభావం కూడ తీవ్రంగా కన్పిస్తుంది. ప్రతి ఓటును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తూ అభ్యర్థులు వ్యక్తిగతంగా వారిని కలిసేందుకు స్థానికంగా ఉండని వారి అడ్రస్సులు సైతం సేకరించే పనిలో పడ్డారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు కొన్నిచోట్ల అప్పుడే ఇంటింటి ప్రచారాలు చేపట్టారు. అభ్యర్థుల విజయం కోసం నేతలతో పాటు వారి కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొంటున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి. పట్టు సాధించేందుకు బీఆర్ఎస్, బీజేపీలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఏదిఏమైనా పల్లెల్లో పంచాయతీ పోరు అప్పుడే రసవత్తరంగా మారింది.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మరోమారు కాంగ్రెస్ సత్తా చాటాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మండలం కేంద్రంలోని ఆవంచ నర్సింహారెడ్డి నివాసంలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యకర్తలతో సమావేశమై తలకొండపల్లి కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థిగా ఆవంచ నర్సింహారెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ అదే జోరు

(ఐదో పేజీ తరువాయి)

తోపాటు కందుకూరు డివిజన్ల పరిధిలోని మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మొత్తం 174 సర్పంచ్ స్థానాలకు గాను 297 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే 1,598 వార్డులకుగాను 1,533 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

ఫిర్యాదులను పరిశీలకుల దృష్టికి తీసుకురండి : కలెక్టర్

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులుగా పాటిల్ ప్రశాంత్ జీవన్, ఐఏఎస్ (89784 62694)ను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలోని ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను పై నంబర్ ద్వారా పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.



కందుకూరు : సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఎస్.రాజశేఖర్‌రెడ్డి



యాచారం : మంతన్‌గౌరెల్లిలో సర్పంచ్‌గా నామినేషన్ వేస్తున్న సొసైటీ వైస్ చైర్మన్ యాదయ్య

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండుగగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాలలో భాగంగా 4వ రోజు గురువారం భజన పోటీలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలలో రాంపూర్‌తో పాటు సమీప గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పవన్ కుమార్ రెడ్డి , ఈవో స్నేహలత, స్థానిక మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కాకి లక్ష్మయ్య, మొక్తాల స్వామి గౌడ్, దానగల్ల వెంకటయ్య, తిక్కల యాదయ్య, దుగ్గాపురం జంగయ్య, బోదాసు జంగయ్య, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, నాయకులు కాకి కృష్ణ, నర్సింహగౌడ్, శ్రీనివాసాచారి, వెంకటయ్య, శ్రీశైలం, బాల్‌రాజ్, రాజు, మల్లేశ్, శ్రీను, రమేశ్, జంగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

కొత్తూర్/కేశంపేట/చౌదరిగూడ/తలకొండపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో ప్రజ లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. పెంజర్ల, మల్లాపూర్, గూడూర్‌లో ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య ఆధ్వర్యంలో కవాతు నిర్వహించి ప్రజలకు ధైర్యం కల్పించారు. అలాగే ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హ క్కు వినియోగించుకోవాలని కేశంపేట సీఐ నరహరి సూచించారు. సంతాపూర్, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెంలో సీఐ పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఎస్సై రాజ్‌కుమార్ ఉన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓ టుహక్కు వినియోగించుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ సూచించారు. తుమ్మలపల్లి, లచ్చంపేట, గుర్రంపల్లిలో పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలపై అవగాహన కల్పించారు. కాగా, సోషల్‌మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఇతరులను కించపరిచేలా వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు.

నియమావళి పాటించాలి

శంకర్‌పలి : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి ఎన్నికల నియామవళిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల నియామవళిని అభ్యర్థులు, అధికారులు, రాజకీయ నాయకులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనాల అనుమతికై తహసీల్దార్ నుంచి అనుమతి పొందాలని, మైకులు, ర్యాలీలు, సభలు, సమావేశాల కోసం స్థానిక సీఐని సంప్రదించాలన్నారు. వీటి అనుమతి సమాచారం రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని సూచించారు.



కొత్తూర్ : పెంజర్లలో గ్రామస్తులకు ఎన్నికల నియమావళిపై సూచనలు చేస్తున్న ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ నర్సయ్య

క్రైం కార్నర్

హైటెన్షన్ టవర్‌పై నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

● వైరు బిగిస్తుండగా ఘటన.. మృతుడు పశ్చిమబెంగాల్ వాసి

యాచారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) హైటెన్షన్ టవర్‌పై నుంచి జారిపడి వ్యక్తి మరణించిన ఘటన బుధవారం సాయంత్రం హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిరెడ్డిగూడలో చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లా కేంద్రానికి చెందిన జమీర్ హుల్‌షేక్(28) బుధవారం సాయంత్రం సాయిరెడ్డిగూడ సమీపంలో 440 కేవీ హైటెన్షన్ టవర్‌పైకి ఎక్కి వైరు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. దాంతో కాళ్లు, చేతులు విరిగాయి. తోటి కార్మికులు అపోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గురువారం మృతుడు జమీర్ హుల్ షేక్ బావ హబీబ్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆదిభట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నంనకు చెందిన సుబ్బారు శ్రీకాంత్(37)మెకానిక్. కాగా, స్కూటీపై స్పేర్‌పార్ట్స్ తీసుకురావడానికి ఆదిభట్ల మీదుగా హైదరాబాద్‌లోని బహదూర్‌గూడకు వెళుతుండగా ఆదిభట్ల సమీపంలోని బీరప్ప గుడి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15 తులాల బంగారం చోరీ

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దొంగలు తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి 15 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీలో నివాసముండే కృష్ణ స్వగ్రామమైన బాలానగర్ మండలం చిన్నరేవెల్లికి బుధవారం మధ్యాహ్నం వెళ్లాడు. ఆయన భార్య భాగ్యలక్ష్మి సాయంత్రం 6గంటల సమయంలో ఇంటికి, గేట్‌కు తాళం వేసి అదే వీధిలో ఉన్న లేడీస్ టైలర్ వద్దకు వెళ్లింది. తిరిగి ఆమె 7గంటలకు ఇంటికి వచ్చి చూడగా.. మెయిన్‌డోర్ తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా కబోర్డు పగులగొట్టి ఉంది. వెంటనే భర్తకు సమాచారం ఇచ్చింది. ఈమేరకు 15 తులాల బంగారం అపహరించుకుపోనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వచ్చి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ తెలిపారు.

వేర్వేరు చోట్ల 134 లీటర్ల మద్యం స్వాధీనం

యాచారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల అక్రమంగా తరలిస్తున్న 134 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గేటు, మాల్ వద్ద కార్లలో, చౌదర్‌పల్లి గేటు వద్ద కారుతో పాటు బైక్‌పై తరలిస్తుండగా మద్యం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కార్లతో పాటు బైక్, 107 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు తెలిపారు.

శంకర్‌పల్లి : అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శంకర్‌పల్లి సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి నుంచి ఆలంఖాన్‌గూడకు కారులో అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా రావులపల్లి గేటు వద్ద గురువారం పోలీసులు 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేశారు.

అక్రమంగా మద్యం నిల్వ..

శంకర్‌పల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంట్లో అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మోకిల గ్రామంలో పోలీసులు పక్కా సమాచారంతో గురువారం 11లీటర్ల మ ద్యాన్ని పట్టుకున్నారు. నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు.

తీగాపూర్ జీపీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కొత్తూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తీగాపూర్ గ్రామపంచాయతీని మండలంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి బీరగూడెం జయప్రద జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జయప్రద గ్రామంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేపట్టారు. గతంలో గ్రామసర్పంచ్‌గా పనిచేసిన తాను ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని ఓటర్లకు వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. బ్యాట్ గుర్తుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మరో అవకాశం ఇస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. గ్రామస్తులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించిన జయప్రదకు గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ చైర్మన్ బీరగూడెం జగన్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమాదేవి రమేష్, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



తీగాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి బీరగూడెం జయప్రద జగన్ మోహన్‌రెడ్డి

అభివృద్ధి పనులకు పెద్దపీట

చేవెళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బుయ్యని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధి పలుగుట్ట వార్డులో రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో చేపట్టిన వీధిదీపాల ఏర్పాటు పనులను వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పలుగుట్ట వార్డులో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే యాదయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జనార్దన్‌రెడ్డిల సహకారంతో పరిష్కరిస్తామన్నారు. వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే యాదయ్యకు వార్డు ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ నర్సింలు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, నాయకులు వాసుదేవ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నారాయణగౌడ్, శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల ప్రగతికి బాటలు వేస్తా : ఆనంద్



కడ్తాలలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న బావండ్లపల్లి ఆనంద్

కడ్తాల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ కడ్తాల ప్రగతికి బాటలు వేస్తానని బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే మరోసారి మోసపోయి గోసపడక తప్పదన్నారు. కడ్తాల బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బావండ్లపల్లి ఆనంద్ గురువారం పంచాయతీ పరిధిలో ప్రచారం ఉధృతం చేశారు. అన్ని వార్డుల్లో పర్యటించి సర్పంచ్‌గా తనను ఆదరించి గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంప శ్రీను, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. బావండ్లపల్లి ఆనంద్‌కు వివిధ కుల, ప్రజా, యువజన సంఘాలు మద్దతు పలికాయి. ఎంపీటీసీ, వైస్ ఎంపీపీగా కడ్తాల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని ఆనంద్ పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రజలకు, వృద్ధులకు, బాధిత కుటుంబాలకు, దైవ, సమాజ సేవా కార్యక్రమాలకు వ్యక్తిగతంగా తన వంతు సాయమందించానని ఆయన తెలిపారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు పేదల కష్టాలు, బాధలు, కన్నీళ్లు తెలుసునని ఆనంద్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కడ్తాల గ్రామ పంచాయతీ అద్భుత ప్రగతి సాధించిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చకుండా ప్రజలను మోసగించిందని మండిపడ్డారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ తాగు నీరు అందేలా చూస్తానని చెప్పారు. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటం చేస్తానని ఆనంద్ తెలిపారు. చెరువు కుంటలను సుందరీకరిస్తానని ఆయన అన్నారు. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను కాపాడడమే తన ధ్యేయమని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేశ్, అంజి, రాంచందర్ , శ్రీకాంత్, యాదయ్య, క్యామ వెంకటేశ్, సంతోష్, బాలయ్య, గణేశ్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జీఎల్ఎన్‌రెడ్డి, ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులను గెలిపించాలి

శంషాబాద్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం శంషాబాద్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాల గురించి చర్చించారు. కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

● 20 మంది అన్నోజిగూడ కార్యకర్తల చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నోజిగూడ గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జంగారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. మీర్ఖాన్‌పేటలో చేపడుతున్న ఫ్యూచర్‌సిటీ నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయని, నగరానికి దగ్గరలో ఉన్న కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాల్లోని కొన్ని గ్రామాలను కలుపుతూ కొత్తనగరాన్ని ఏర్పాటు చేయడంతో యువతకు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు విరివిగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కడ్తాలను ఆదర్శంగా నిలుపుతా : భిక్షపతి

కడ్తాల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తోడ్పాటు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిల సహకారంతో ప్రత్యేక నిధులు రాబట్టి కడ్తాల గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతానని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి అన్నారు. సర్పంచ్‌గా ఆదరించి గెలిపిస్తే పాలకుడిగా కాక.. సేవకుడిగా పనిచేస్తానని చెప్పారు. కడ్తాల గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన రాయికంటి భిక్షపతి గురువారం గ్రామ పంచాయతీ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగించారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కుల, మహిళ, యువజన సంఘాల నేతలను కలిసి కాంగ్రెస్ అభ్యర్థినైన తను మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జాతీయ రహదారిపై ఉన్న కడ్తాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు తీర్చేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేసేలా చూస్తానని చెప్పారు. రాష్ట్ర రాజధానికి చేరువలో, ఫోర్త్ సిటీకి సమీపంలో ఉన్న కడ్తాల అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్య, వైద్య, ఉపాధి, పారిశుధ్య కార్యక్రమాలకు, వ్యవసాయ రంగం అభివృద్ధికి, కులవృత్తుల బలోపేతానికి, చిరు వ్యాపారుల ఉపాధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటునందేలా చూస్తానని భిక్షపతి పేర్కొన్నారు. టీపీసీసీ ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే గ్రామాల ప్రగతి సాధ్యమన్నారు. అవకాశవాద పార్టీల నేతల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదరిక నిర్మూల, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహంగీర్‌అలీ, రాంచందర్ నాయక్, జహ ంగీర్‌బాబా, రాజేందర్, బోసు రవి, మల్లయ్య, మంకి శ్రీను, మల్లేశ్ గౌడ్, యాదయ్య గౌడ్, బీచ్యనాయక్, చంద్రోజీ, జంగారెడ్డి, బుచ్చయ్య, యాదగిరి రెడ్డి, కృష్ణ, రమేశ్, సత్యం యాదవ్, రాజేందర్ గౌడ్, శ్రీకాంత్, మహేశ్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి



మహిళను ఓటు భ్యర్థిస్తున్న రాయికంటి భిక్షపతి

జంపింగ్ జపాంగ్!

(ఐదో పేజీ తరువాయి)

ఆశ చూపుతున్నాయి. ఒకవేళ రిజర్వేషన్ల వల్ల ఇబ్బందులు తలెత్తితే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామంటూ హామీలు ఇస్తున్నాయి. దీంతో వివిధ పార్టీల్లో ఉన్న కొందరు నాయకులు ఇదే మంచి తరుణమని భావించి పార్టీలను మారుతున్నారు. ఇలా గ్రామాల్లో పలుకుబడి ఉన్న నాయకులు పార్టీలు మారడం వెనుక వేరే మతలబు ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏండ్ల తరబడి పార్టీకే అంకితమైన వ్యక్తులు ఎన్నికల సమయంలో పార్టీలు మారుతున్నారు. అయితే జంపింగ్ జిలానీలతో పోటీలో నిలిచినవారు అయోమయానికి గురవుతున్నారు. ఎవరి భవితవ్యం ఎలా ఉంటుందో తెలియాలంటే మరో 11రోజులు వేచి చూడాల్సిందే.

ఆ రెండు పార్టీలకు ప్రతిష్ఠాత్మకం..

గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ సత్తాను చాటాలని చూస్తున్నాయి. అత్యధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకొని సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు భావిస్తుంటే.. బీఆర్ఎస్ కూడా అదే స్థాయిలో తమ పార్టీ మద్దతుదారులను గెలిపించుకోవాలని చూస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గుర్తింపుపై పోటీచేసే అభ్యర్థులు సులువుగా గెలవాలంటే సర్పంచ్ ఎన్నికలే కీలకమని, ఇందులో విఫలమైతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం పడుతుందని ఈ రెండు పార్టీలు భావిస్తున్నాయి. అయితే, సర్పంచ్ ఎన్నికల్లో మాత్రం ఎక్కడా కూడా బీజేపీ తన ఉనికిని చాటుకోలేకపోతుంది. బీజేపీ మద్దతుదారులు నామినేషన్లు వేసినప్పటికీ పెద్దగా వారి ప్రభావం కనపడటం లేదు. షాద్‌నగర్ నియోజకవర్గం నుంచే ఆ పార్టీలో నలుగురు రాష్ట్ర కార్యవర్గ సభ్యులున్నప్పటికీ, వారు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదు. పార్టీలో ఉన్న విభేదాలే బీజేపీ కొంపముంచుతున్నాయని కొందరు గుసగుసలాడుతున్నారు. ఇప్పటివరకు అగ్రనాయకులు ఎవరూ కూడా సర్పంచ్ ఎన్నికల ఊసెత్తకపోవడం గమనార్హం.

బీఎస్‌డీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పోచయ్యగౌడ్




షాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భారత్ సమాజ్ డెవలప్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా షాబాద్ మండలం సంకేపల్లిగూడ గ్రామానికి చెందిన చెవుల పోచయ్యగౌడ్‌ను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోతగల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలో నియామకపత్రాన్ని అందజేశారు. పోచయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చింతాడ సూర్యం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోతగల్ల శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏకగ్రీవాలు.. సన్మానం

కడ్తాల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గాన్గుమర్ల తండా పంచాయతీలో రెండు వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవమయ్యాయి. 1వ వార్డుకు నేనావత్ అఖిల, 2వ వార్డుకు శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ వారిని సత్కరించారు. సేవ్యానాయక్, పాండునాయక్, శంకర్‌నాయక్, శ్రీనునాయక్, లక్ష్మణ్ నాయక్, భీమన్ నాయక్, జగన్ నాయక్, కిషన్, రాజు, నవీన్, రంగానాయక్, తదితరులున్నారు.

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండలంలోని 21గ్రామ పంచాయతీల్లో 67మంది సర్పంచ్ అభ్యర్థులు, 485 మంది వార్డు సభ్యులుగా బరిలో నిలిచారు. 21 గ్రామ పంచాయతీల్లో 12 వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో మున్నీ తెలిపారు.



ఏకగ్రీవమైన సభ్యులను సన్మానిస్తున్న దశరథ్, తండా వాసులు